## పరిధి దాటి వైద్యం చేయబోం



- పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్గం మోహన్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

పీఎంపీ లు ప్రథమ చికిత్స కాకుండా వారి పరిధికి మించి వైద్యం అందిస్తే, వారిపై టిఎస్ఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలని అందుకు తమ అసోసియేషన్ సైతం సహకరిస్తదని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుల్గం మోహన్ అన్నారు. అసోసియేషన్ నిజామాబాద్ మండల సమావేశం సుభాశ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. టీఎస్ఎంసి దాడులు తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రాక్టీస్‌లో ప్రథమ చికిత్సలే చేస్తున్నామని తెలిపారు. అంతకుమంచి వైద్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, నకిలీ వైద్యులను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వహీద్, కోశాధికారి పురుషోత్తము, జిల్లా సెక్రెటరీ రాములు, మురళి, నరసయ్య, జఫ్రూల్లా, ఇంతియాజ్, మహిపాల్, బాలకృష్ణ తదితర పిఎంపిలు పాల్గొన్నారు.


# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

# నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | డిసెంబర్ 02, 2024 | www.navatelangana.com


## వరి నాట్లు షురూ



**నవతెలంగాణ-వర్ని(చందూర్)**

ముందస్తు వరినాట్లకు బాన్సువాడ నియోజకవర్గం ప్రసిద్ధి. ప్రతి సీజన్‌లో ముందస్తు వరి నాట్లు వేస్తూ ముందుగానే పంటకోతలు పూర్తి చేస్తుంటారు. దీంతో అకాల వర్షాలు, వడగండ్ల బారి నుంచి తప్పుకుంటారు. రబీ సీజన్‌కు సైతం నారుమడుగులు సిద్ధం చేసుకున్న ఇక్కడి రైతులు.. నాట్లు వేయడం ప్రారంభించారు. చందూర్ మండలంలోని ఘనపూర్ గ్రామంలో ఆదివారం యాసంగి వరి నాట్లు ప్రారంభం అయ్యాయి. ఇతర రాష్ట్ర కూలీలు ఇప్పటికే ఉమ్మడి వర్ని మండలానికి చేరుకొన్నారు. వలస కూలీలకు సైతం ఎక్కువ రోజులు పని దొరికే అవకాశం లభించనట్టవుతుంది.

# సర్వేలో తప్పులతడక!





- ఆధార్, ఫోన్ నెంబర్‌తో పాటు ఇతర వాటిల్లో తప్పిదాలు
- ఉన్నతాధికారుల ఒత్తిడితో చివరి రోజుల్లో హడావుడిగా నమోదు
- ఆన్‌లైన్ డాటా ఎంట్రీ సమయంలో వెలుగులోకి..

**నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి చేపట్టిన సమగ్ర ఇంటింటి కులగణన కుటుంబ సర్వే.. పలువురు అధికారులు, సిబ్బంది తీరుతో అసమగ్రంగా మారింది. 75 ప్రశ్నలతో రూపొందించిన ఫామ్‌లో.. పలు వివరాలు తప్పులుగా నమోదు చేసినట్టు సమాచారం. 12 నెంబర్‌లు గల ఆధార్‌కు బదులు పది, 11 నెంబర్‌లు మాత్రమే రాసుకొచ్చిన వైనం కొన్నిచోట్ల వెలుగులోకి వచ్చాయి. తొమ్మిది నెంబర్‌లతోనే ఫోన్ నెంబర్ ఉండటంతోపాటు ఇతరాత్రా వివరాలు సైతం సరిగా రాయకుండానే సర్వే మమ అనిపించినట్టు సమాచారం. డాటా ఎంట్రీ సందర్భంగా ఈ విషయాలు వెలుగు జూస్తున్నాయి. 100 ఫామ్‌లు ఎంట్రీ కోసం తీసుకుంటే అందులో సుమారు 10 ఫామ్‌లలో తప్పిదాలు దొర్లినట్టు వినికిడి. ఫోన్ నెంబర్‌లు సరిగా ఉన్న వాటికి ఆపరేటర్ లు ఫోన్ చేసి వివరాలు సరి చేస్తుండగా.. నెంబర్ తప్పు ఉన్న వాటికి అదే విధంగా ఎంట్రీ చేసి వదిలేస్తున్నారు.

కుల గణనతో పాటు రాష్ట్రంలో ఉన్న ప్రజల సమగ్ర వివరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సమగ్ర సర్వేను తీసుకొచ్చింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 547 గ్రామపంచాయతీల తోపాటు నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్, బోధన్, ఆర్మూర్ మున్సి పాల్టీల్లో మొత్తం కలిపి 4,69,988 ఇండ్లు గుర్తించారు. 3453 బ్లాక్‌లుగా విభజించి 3580 మంది ఎన్యూమరేటర్‌లను నియమించారు. 175 ఇండ్లకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున కేటాయించారు. 10 మంది ఎన్యూమరేటర్‌ల పర్యవేక్షణకు ఒక సూపర్‌వైజర్ చొప్పున మొత్తం 358 మంది సూపర్‌వైజర్‌లను కేటాయించారు.

**తప్పుల తడకగా వివరాల నమోదు**

ఉదాహరణకు ఆధార్ నెంబర్‌కు 12 అంకెలు ఉంటే.. కొన్ని ఫామ్‌లో 10, 11 నెంబర్‌లు మాత్రమే రాశారు. ఫోన్ నెంబర్ సైతం పది అంకెలకు బదులుగా 8, 9 నెంబర్‌లు రాశారు. దీంతోపాటు భూములు, అప్పులున్నట్టు రాసినా.. వాటి వివ రాలు పొందు పర్చ లేదు. సాగు భూమి ఉన్నట్టు చెప్తే.. ఎన్ని ఎక రాలు, భూమి రకం తదితర వివ రాలు రాయ లేదు. అప్పులున్నట్టు రాసినా.. ఎంత మేర, ఎందుకోసం తీసుకున్నారో లేదు. సర్వే తొందరగా పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశంతో చివరి రోజుల్లో పలు ఫామ్‌లలో హడావుడిగా నమోదు చేసినట్టు తెలిసింది పలు చోట్ల కుటుంబీకులు సహకరించలేదనే వాదనలు ఉన్నా.. సహకరించి వివరాలు ఇచ్చిన వాటిల్లోనే అనేక తప్పులు దొర్లినట్టు సమాచారం.

**డాటా ఎంట్రీతో వెలుగులోకి..**

సర్వే పూర్తి కావడంతో వారం రోజులుగా ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ ప్రారంభించారు. డాటా ఎంట్రీ రెండు విభాగాలుగా నమోదు చేస్తున్నారు. మొదటి పార్ట్‌లో మొత్తం 7 పేజీలలో కుటుంబీకుల వివరాలు, రెండవ పార్ట్‌లో 1 పేజీలో ఇంటి యజమానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగానే పలు అంశాలు తప్పుగా నమోదు చేసినట్టు వెలుగుజూస్తున్నాయి. సామాజిక తరగతి నమోదు చేసి కులం పేరు నమోదు చేయకపోవడం, వ్యవసాయ భూమి ఉంటే దాని విస్తీర్ణం, భూమి రకం తదితర వివరాలు నమోదుచేయకపోవడం గమనార్హం. ఆ వివరాలు సరి చేసేందుకు పలువురు డాటా ఎంట్రీ ఫోన్ చేసి మరోసారి అడిగి నమోదు చేస్తున్నారు. మరి కొన్నింటిలో ఫోన్ నెంబర్ సైతం తప్పుగా ఉండటంతో చేసేదేమీ లేక పలు అంశాలను వదిలేస్తూ ఎంట్రీ పూర్తి చేస్తు న్నారు. ఖచ్చితమైన వాటికి.. ఆపరేటర్‌లే ఏదో ఒకటి పెట్టాలని సూపర్‌వైజర్‌లు సూచిస్తున్నట్టు సమాచారం. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందా అన్న సందేహం కలుగుతోంది.

# సంచారజీవుల పొట్టతిప్పలు

- వలసలుగా వెళ్తుండటంతో ఛిద్రమవుతున్న చిన్నారుల జీవితాలు

**నవతెలంగాణ-రెంజల్**



కూటి కోసం కోటి విద్యలు అనేది నానుడి. సంచార జీవులు తమ పొట్టపోసుకునేందుకు ఇనుప పనిముట్లు తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. ఇలా ఊరూరు తిరుగుతూ గుడిసెలు వేసుకుంటూ తమ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా చదువుకో వలసిన పిల్లలు సైతం తల్లిదండ్రులతో కలిసి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలు సైతం సుత్తెను చేత పట్టుకొని వస్తువులు తయారు చేయడంలో సహాయపడుతూ కుటుంబానికి ఆసరవుతున్నారు. ఎండనక వాననక వస్తువులను తయారు చేస్తేనే తమకు బుక్కెడు అన్నం కడుపులో వస్తుందని వారు పేర్కొంటు న్నారు. గ్రామీణ ప్రాంతాలలో గడ్డపారలు, ఇతర ఇనుప వస్తువులను తయారు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తాము చేసే సంచార జీవనంతో పిల్లలకు చదువులు చెప్పించలేకపోతున్నామని వాపోతున్నారు. పాలకులు మారుతున్నా.. విధానాలు మారు తున్నా.. సంచార జాతుల సంక్షేమ పట్ల ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారికి ఉపాధి కల్పించి వారి పిల్లలకు చదువు చెప్పిస్తే ముందుముందు వారికి ప్రభుత్వ, ప్రయివేటు సెక్టార్‌లలో ఉద్యోగాలు లభించి వారి జీవనపరిస్థితులు మారే అవకాశం ఉంది.



తల్లిదండ్రులకు సహకారంగా పనిముట్ల తయరీలో సహకరిస్తున్న పిల్లలు

## ప్రజాపాలన విజయోత్సవాలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ప్రజాపాలన విజయోత్సవాలు మున్సిపల్ పరిధిలో ప్రారంభించినట్టు కమిషనర్ దిలీప్‌కుమార్ ఆదివారం తెలిపారు. తొలిరోజు స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. నేడు నగరంలోని అన్ని పార్కుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, 3న అర్బన్ డే లో భాగంగా వివిధ కార్యక్రమాలు, 4న విద్యుత్ సమస్యలపై ప్రత్యేక డ్రైవ్, 5న ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు, 6న డెంగ్యూ బాధిత ప్రాంతాల్లో ప్రజలకు డ్రై డే కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. 7న రోడ్డు మార్జిన్‌లో పోసిన భవన నిర్మాణ వ్యర్థాలను, డిబ్రిస్‌ను తొలగించనున్నట్టు తెలిపారు. 8న నగరంలోని అన్ని పబ్లిక్ టాయిలెట్స్ బిఓటి, టాయిలెట్లను శుభ్ర పరచనున్నామని, 9న ముగింపు సందర్భంగా ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, ఎస్‌హెచ్‌జి మెంబర్స్‌తో కలిసి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## విద్యార్థి మృతి బాధాకరం

- ఆయన పట్ల ఎలాంటి నిర్లక్ష్యమూ చేయలేదు
- విద్యార్థి దినచర్య విడుదల చేసిన కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్



మాట్లాడుతున్న రజనీకాంత్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

కాకతీయ స్కూల్‌లోని హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతున్న శివజశ్విత్‌రెడ్డి శుక్రవారం మృతిచెందిన విషయం విధితమే. కాగా ఈ ఘటనపై కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థి మృతి బాధాకరమని, తల్లిదండ్రులకు తీరని లోటు అని అన్నారు. తమ విద్యాసంస్థ విద్యార్థుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యమూ చేయలేదని తెలిపారు. సదరు విద్యార్థికి సంబంధించిన గురు, శుక్రవారం రెండు రోజుల దినచర్యను విడుదల చేశారు. గురువారం రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు యాక్టీవ్‌గా ఉన్నాడని, వాలీబాల్ సైతం ఆడాడని, క్లాస్‌లకు, స్టడీ అవర్‌కు అటెండ్ అయినట్టు తెలిపారు. 7 గంటల సమయంలో వాంతులు అవుతున్నట్టు తెలపడంతో వార్డెన్ మెడిసిన్ ఇచ్చారని తెలిపారు. తల్లిదండ్రులకు సైతం సమాచారం ఇచ్చి మాట్లాడించినట్టు తెలిపారు. ఆస్పత్రికి వెళ్దామంటే తరువాత రోజు తల్లిదండ్రులు వచ్చాకవెళ్తామని విద్యార్థి చెప్పాడని, శుక్రవారం ఉదయం సైతం హాస్టల్‌లో చేసిన బోండం తిన అంటే ఆయన కోరిక మేరకు బయట నుంచి దోశ తీసుకొచ్చి తినిపించినట్టు తెలిపారు. తర్వాత తల్లిదండ్రులను కలవడానికి వచ్చే సమయంలో విద్యార్థి ఒక్కసారిగా కుప్పకూలిపోయారని, వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లామని తెలిపారు.

# రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత
- కులగణనకు అడ్డుకునే శక్తుల ప్రయత్నాలను తిప్పికొట్టాలి : ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

**నవతెలంగాణ-కామారెడ్డి**

రాజ్యాంగాన్ని మార్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, తెలంగాణలో జరుగుతున్న కులగణను అడ్డుకోవడానికి సైతం కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మూడవ విద్యాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని శక్తులు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను ఎప్పటికప్పుడు పసిగడుతూ ప్రజలు అడ్డుకోవాలన్నారు. దేశంలో కుక్కలకు, పందులకు, పులులకు లెక్కలు ఉన్నాయి కానీ బీసీలకు లెక్కలు లేవని అందుకు కులగణనే సరైన దారని రాహుల్ గాంధీ ఆలోచించి దేశంలో నే మొదటగా తెలంగాణలో కులగణను చేపట్టారన్నారు. దీని ఓర్వలేని కొందరు రాజకీయ నాయకులు రాజకీయం చేస్తూ దీనిని అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని అందుకు ఎస్సీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు.

**ఎస్సీలు, ఎస్టీలు ప్రధానోపాధ్యాయునిగా ఉంటే ఓర్వలేకపోతున్నారు**

ఈ కార్యక్రమానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ నేడు కొందరు రిజర్వేషన్లను తీసేయాలని అంటున్నారని తాము ఉద్యోగంలో మాత్రమే రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు పొందుతు న్నామని అలా రిజర్వేషన్లు తీసేస్తే ఆస్తులను అందరం సమానంగా పంచుకుందామని అన్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యా యులుగా ఉంటే ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ఇతర సంఘాలలో ఉంటే పదవులలో ఉండండి కానీ కుర్చీలు మోసే పనిలో మాత్రం ఉండొద్దని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే హెచ్ఐవి దూరం

**అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

**నవతెలంగాణ-కామారెడ్డి**




'ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ఈ వ్యాధిని దూరం చేయడానికి అవకాశం ఉంటుంది. ఒకప్పుడు ఈ వ్యాధి అంటే చాలామంది భయపడే వారిని అలాగే ఆత్మహత్యలు కూడా చేసుకునే వారని, ప్రస్తుతం ఆధునిక చికిత్స ద్వారా హెచ్ఐవి సోకిన వారికి క్రమంగా మందులు వాడితే ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరిలాగే జీవించే అవకాశం ఉంది. కావున ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే రాబోయే రోజుల్లో హెచ్ఐవి నిర్మూలించే అవకాశం ఉందని' అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే 2024 సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదటగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి తదుపరి కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.



అడవిని తలపిస్తున్న మల్‌తుమ్మెద ఉద్యానవనం

# ఉద్యానవనం.. అధ్వానం

**నిర్లక్ష్యం నీడలో హార్టికల్చర్ నిధులు లేకపోవడంతో నిలిచిన అభివృద్ధి**

**అడవిని తలపిస్తున్న మాల్‌తుమ్మెద విత్తన క్షేత్రం**

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

పాలకుల పట్టింపులేని తనం, అధికారుల నిర్లక్ష్యం వెరసి రకరకాల పండ్ల, పూల మొక్కలను ఉత్పత్తి చేసే ఉద్యాన క్షేత్రం.. నేడు అడవిని తలపిస్తుంది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్ తుమ్మెద శివారులో 40 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన హార్టికల్చర్ నేడు నిర్లక్ష్యం నీడలో సతమతమవుతుంది. గతంలో హార్టికల్చర్‌లో ఒక ఐడిఏ ఇద్దరు ఉద్యాన అధికారులు ఇతర సిబ్బంది కలిపి 12 మంది వరకు పని చేసేవారు. నిత్యం 100 మందికి పైగా కూలీలతో అంటూ మొక్కల ఉత్పత్తి జరిగేది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ప్రత్యక్షంగా ఈ క్షేత్రానికి వచ్చి సేద తీరేవారు. అంతగా పేరుగాంచిన మాల్ తుమ్మెద ఉద్యానవన క్షేత్రం దయనీయంగా తయారైంది.



మాల్తుమ్మెదలోని ఉద్యాన మొక్కల ఉత్పత్తి కేంద్రం

మండలంలోని మాల్‌తుమ్మెద విత్తన క్షేత్రంలో 63 ఎకరాలలో గత 40 సంవత్సరాల క్రితం హార్టికల్చర్ ఏర్పాటు చేశారు. ఉద్యాన క్షేత్రంలో మామిడి తోట వేలంపాట నిర్వహించడంతో ఏటా ప్రభుత్వానికి లక్ష నుండి రెండు లక్షల వరకు ఆదాయం వస్తుండేది. అదే విధంగా జామ తోట వేలం నిర్వహణతో 60 నుంచి 70 వేల వరకు ఆదాయం వస్తుంది. నిర్లక్ష్యం వెంటాడటంతో ఆ వచ్చే ఆదాయం కూడా గండి పడే అవకాశం ఉంది. ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యాన క్షేత్రం అడవిని తలపిస్తుంది.

**నిధుల కొరతతో నిలిచిన అభివృద్ధి**

2014లో ఉద్యానవనం అభివృద్ధికి రూ. కోటి 49 లక్షలు కేటాయించడంతో కార్యాలయ భవనాలు మరమ్మతులు చేయడంతో పాటు సోలార్ లైట్లు సోలార్ బోర్ మోటర్లు ఏర్పాటు చేశారు. అంటూ కట్టిన మొక్కలను భద్రపరిచేందుకు లిస్ట్ చాంబర్, రైతులకు శిక్షణ ఇచ్చేందుకు శిక్షణ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేశారు. రెండు ట్రాక్టర్లను సైతం కొత్తగా కొనుగోలు చేశారు. తదనంతరం గత పది సంవత్సరాల నుండి నిధులు కేటాయించక పోవడంతో పాటు శాశ్వత అధికారిని నియమించకపోవడంతో ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులు వేరే చోటికి బదిలీ కావడంతో ఉద్యానవన క్షేత్రం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.

**63 ఎకరాలకు ఇద్దరు వాచ్‌మెన్‌లే దిక్కు**

10 మంది అధికారులతో పాటు పగలు రాత్రి విధులు నిర్వర్తించే ఇద్దరు వాచ్‌మెన్‌లతో పాటు 12 మంది పనిచేయాల్సిన ఉద్యానవన క్షేత్రంలో చివరికి ఇద్దరు వాచ్‌మెన్‌లు మాత్రమే మిగిలిపోయారు.

**రోజుకు 100 మందికి ఉపాధి**

ఇక్కడి క్షేత్రంలో ప్రతిరోజు 100 మందికి పైగా ఉపాధి కల్పించే అవకాశం ఉంది. నిధులు లేకపోవడంతో అధికారులు చేసేది ఏమీ లేక వచ్చిన వారు వచ్చినట్టు బదిలీపై వెళ్ళిపోతున్నారు. ఉద్యమ క్షేత్రానికి శాశ్వత అధికారాన్ని నియమించి నిధులను విడుదల చేస్తే మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఉపాధి కలిగే అవకాశం ఉంది. పాలకులు, సంబంధిత అధికారులు ఇకనైనా దీనిపై దృష్టి సారించి నిధులను మంజూరు చేసి శాశ్వత అధికారిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**పర్మినెంట్ అధికారులు లేక..**

ఉద్యానవన క్షేత్రంలో హెచ్ఓగా విధులు నిర్వర్తించిన రామకృష్ణ గత మూడు నెలల క్రితం కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన కమలాకర్ కరీంనగర్ వెళ్ళిపోయారు. అదేవిధంగా సదాశివనగర్ హెచ్ఓగా విధులు తెలుస్తున్న హర్షవర్ధన్ మాల్తుమ్మెదకు ఇన్చార్జి బాధ్యతలు చేపట్టారు. చేపట్టిన రెండు వారాల్లోనే తిరిగి ఆయన బదిలీ అయిపోయారు. ఆయన స్థానంలో నూతనంగా వనపర్తి లో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఇన్చార్జ్ బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ గురువారం వరకు విధులకు రాలేదు.



పిచ్చిమొక్కలతో నిండిన పందిరిసాగు

**తుప్పు పడుతున్న యంత్రాలు, యంత్ర పరికరాలు**

ఉద్యానవన క్షేత్రానికి అభివృద్ధి పరచడానికి కొనుగోలు చేసిన యంత్ర పరికరాలు వాడకపోవడంతో తుప్పు పట్టిపోతున్నాయి. పెట్టినవి పెట్టిన చోటే తుప్పుపట్టే విధంగా తయారైపోయాయి. అదేవిధంగా అధికారుల కొరతతో పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యానవన క్షేత్రం అడవిలా తెలిపిస్తుంది.



## సంక్షేమ పథకాలు కనిపిస్తలేవా..?

- విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రాక్షస పాలనకు ప్రజలు ముగింపు పలికి ప్రజాపాలన అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఏర్పాటు చేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, కానీ బీఆర్ఎస్ నాయకులకు అవి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అన్ని శాఖలను విచ్చినం చేసిందని వాటిని బాగు చేస్తూనే మరో పక్క ప్రజలకు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్ అందించడం గానీ, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచడం, గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అమలు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మీద విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని సూచించారు. లేకుంటే ప్రజలే తిరగబడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కూడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంతా రెడ్డి రాజారెడ్డి, మాజీ బీసీ సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ ,రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్ ,జిల్లా సేవదళ్ అధ్యక్షులు సంతోష్ ,జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ శ్రీనివాస్ , ఎన్ ఎస్ యు ఐ నాయకులు అఖిల్, శశి కుమార్ ,సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేత



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్‌లోని మాధవ నగర్ బిఎల్ఎన్ గార్డెన్ లో అమెజాన్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఒలంపిక్ అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి హాజరయ్యారు. అసోసియేషన్ ఒలంపిక్‌కి సంబంధించిన పిల్లలందరికీ తైక్వాండో సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో పైచదువులకు ఉపయోగపడుతుందని, వారు ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. వచ్చే రాష్ట్ర, జాతీయస్థాయిలో మెడల్ సాధించాలని, నిజామాబాద్‌కు మంచి పేరు తీసుకురావాలని, మన తెలంగాణాకే మంచి పేరు తీసుకురావాలని అన్నారు. శిక్షణ ఇస్తున్న మనోజ్ కుమార్‌ను, పిల్లల తల్లిదండ్రులను అభినందించారు.

## దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-మోపాల్

దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదిఆవరం హైదరాబాదులో జరిగిన దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనానికి తరలివెళ్లారు. వికలాంగుల సంక్షేమ అధికారి శైలజ, వికలాంగుల చైర్మన్ ముత్తినేని వీరయ్య, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ అభిబ్ మియా, కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ సభ్యులు సుమారు 20 మంది పాల్గొన్నారు. ఇందులో దివ్యాంగ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రధాన కార్యదర్శి శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్యకు విన్నవించారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగ సంఘం నాయకుడు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపంతో మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని నాగారం 80క్వార్టర్స్‌లో నివాసం ఉండే మీసాల కృష్ణ (44) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. దీంతో ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కృష్ణ ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆమె రాకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన మద్యం మత్తులో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మాలల సింహగర్జనకు తరలిన జిల్లా నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి/ఆర్మూర్

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహ గర్జనకు నిజామాబాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని పులాంగ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ నీ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ ఎడ్ల నాగరాజు, అంగరి ప్రదీప్, మాలల జేఏసీ నాయకులు అనంపల్లి ఎల్లయ్య తెలిపారు.

**డిచ్‌పల్లి :** హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన మాలల సింహ గర్జనకు డిచ్ పల్లి, ఇందల్ వాయి మండలాల నుండి బారి సంఖ్యలో తరలివెళ్లారు.తరలిన వారిలో గైని గంగారం, బంగారు లక్ష్మణ్, నీరడి పద్మారావు, నీరడీ లక్ష్మణ్, సఖి కిషన్, పాశం కుమార్, పోతే ప్రభాకర్, దూస్గాం రాజు, చాకటి పద్మారావు, తదితరులు ఉన్నారు.

**ఆర్మూర్:** మున్సిపల్ పట్టణ కేంద్రంలోని నల్ల పోచమ్మ గల్లీలో గల అంబేద్కర్ మాల సంఘం సభ్యులు 50 మందితో హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహ గర్జన భారీ బహిరంగ సభకు ఆదివారం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కొంతం మురళీధర్, అధ్యక్షులు ఐతే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పింజ సుదర్శన్ ఉపాధ్యక్షులు చుక్క నాగరాజు, సంఘ సభ్యులు బయలుదేరారు.

## అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పనిచేయుటకు అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చరిత్ర, స్టాటిస్టిక్స్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల కోసం మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తీసుకొని కళాశాలకు (మంగళవారం) ఈనెల 3న రావాలని పేర్కొన్నారు. అదే రోజు ఇంటర్వ్యూ, డెమోల ద్వారా ఎంపిక చేయనున్నట్టు పీహెచ్డీ, నెట్, సెట్ బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు.

## బాధితులకు ఇల్లు కట్టించాలి

- ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డు గంగాధర్

నవతెలంగాణ-మాక్లూర్

ఒడ్యాట్‌పల్లి గ్రామంలో నిజామాబాద్ నుండి పెద్దపల్లి రైల్వే లైన్లో ఇండ్లు కోల్పోయిన బాధితులకు ఇల్లు స్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టివ్వాలని ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఒడ్యాట్‌పల్లి గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. నిజామాబాద్ నుంచి పెద్దపల్లి, రైల్వే లైన్ ఎస్సీ వాడకు చెందిన 28 ఇండ్లు కోల్పోయారని, వారికి ఇండ్లస్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, వడ్డెన్న గంగారం, వడ్డెన్న, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మృతికి కారణమైన కాకతీయ విద్యా సంస్థ పై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థి మృతికి కారణమైన కాకతీయ విద్యా సంస్థ యాజమాన్యం పై చర్యలు తీసుకుంటూ, విద్యార్థి మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ నగరంలో పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. కాకతీయ విద్యాసంస్థల్లో రెండు రోజుల క్రితం జశ్వంత్ రెడ్డి అనే తొమ్మిదవ తరగతి విద్యార్థి మృతికి కారణమైన కాకతీయ విద్యాసంస్థల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి అనారోగ్యంతో ఉన్నాడని మూడు రోజులుగా వార్డెన్‌కు, బాధ్యులకు సమాచారం ఉన్న వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు పిడిఎస్‌యు పరిశీలనలో తేలిందని అన్నారు. తల్లి తండ్రులు వచ్చాకే హాస్పిటల్ వెళ్దాం అని విద్యార్థి అన్నాడని, విద్యార్థి చని పోయాక చెప్పటం సిగ్గు చేటు అన్నారు. ఒక ఫోన్ కాల్ చేసి తల్లిదండ్రులకు సమాచారం అందిస్తే విద్యార్థి బతికేవాడని తెలిపారు. విద్యార్థి మృతి చెందిన తర్వాత హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించకపోవడం సిగ్గుచేటు అన్నారు. తప్పు చేయకపోతే ఎందుకు విద్యార్థిని భౌతిక కాయం దొంగ చాటున తల్లిదండ్రులకు ఎందుకు అప్పగించారని ప్రశ్నిస్తున్నామన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు కలెక్టర్ స్పందించి న్యాయబద్ధంగా విచారం చేయాలని అన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, నాయకులు రవీందర్,అక్షయ్,రాకేష్ ,వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికేట్ అందుకున్న పట్టణ వైద్యులు సిఎస్ చైతన్య



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని నిత్య ఈఎన్‌టీ వైద్యులు సిఎస్ చైతన్య ఇటీవల బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఆనంద్‌తో సర్టిఫికెట్ అందుకున్నారు. ఎలర్జీ స్పెషలిస్టు కోర్సులో భాగంగా జిల్లా కేంద్రంలోని వైద్యులు రాజేంద్రప్రసాద్ తో పాటు సి ఎస్ చైతన్య అందుకోవడంతో పట్టణ వైద్యులు హర్షం వ్యక్తం చేసినారు.

## సీపీ చేతుల మీదుగా మెడల్ అందుకున్న భీంగల్ విద్యార్థి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

నిజామాబాద్ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో డిస్టిక్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన క్రీడల్లో రన్నింగ్‌లో 100 విభాగంలో భీంగల్ మండలం జాగిర్యాల్ గ్రామానికి చెందిన దేవాన్ష్ గడాల మూడోస్థానంలో నిలిచారు. పోలీస్ కమిషనర్ సింధు చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు.

## లెప్రసి కాలనీలో అల్సర్ కిట్లటబ్బులు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని దేవనగర్ కాలనీ, దేవపల్లి కాలనీ లెప్రసీ, వంద్రికల్ లెప్రసీ కాలనీ బాధితులకు ఎన్‌టిపిసి సహకారంతో లెప్రసి సొసైటీ అధ్వర్యంలో స్లాప్- టిస్ రాష్ట్ర అధ్యక్షుడు యం.రమేష్ సమక్షంలో 134 అల్సర్ కిట్ల టబ్బులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# లాభదాయకం.. నాటు కోళ్ల పెంపకం

- నాటు కోడికి పెరుగుతున్న డిమాండ్
- ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ
- నెలకు రూ. 50 వేలు మిగులు

నవతెలంగాణ-మాక్లూర్

మాంసాహారుల్లో ఆరోగ్య ఋస్పృహ పెరుగుతున్న కొద్దీ నాటు కోళ్లకు మార్కెట్లో డిమాండ్ పెరుగుతూ వస్తుంది. అయితే షెడ్లల్లో కోళ్లను పెంచి తక్కువ ఖర్చుతోనే అధిక లాభాలు సాధిస్తున్నారు. మండల పరిధిలోని గంగరవంద గ్రామానికి చెందిన రైతు కరిపే రాజు వ్యవసాయంతోపాటు వ్యాపారం చేయాలనే ఆలోచనతో వ్యవసాయ అనుబంధ రంగమైన నాటు కోళ్ల పంపకం చేపట్టాడు. తక్కువ ఖర్చుతోనే నాటు కోళ్ల పెంపకం నిర్వహిస్తున్నాడు. నెలకు సుమారు 1500 నాటు కోళ్లను అమ్మే స్థాయికి ఎదిగాడు. ఖర్చులు తగ్గించుకుంటూ అధిక లాభాలు పొందుతున్నాడు. ఈ ప్రాంతంలో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

వినూత్నమైన ఆలోచనలు మనోబలంతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చనడానికి నిదర్శనం ఈ రైతు. 10 ఎకరాల వ్యవసాయం చేస్తూ కోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. మండల కేంద్ర సమీపంలో షెడ్డు లీజుకు తీసుకొని ఆరు బయటే తిరిగాడే పద్దతిలో నాటు



కోళ్లని పెంచుతున్నాడు. నెలకు సుమారు 50 వేల ఆదాయం పొందుతున్నాడు. ఇతరులు నిర్వహిస్తున్న కోళ్ల ఫారాలను స్వయంగా పరిశీలించి నాటు కోళ్లను షెడ్లలో పెంచే పద్ధతులు, నిర్వహణ ఖర్చు, కోళ్లకు వ్యాధులు రాకుండా తీసుకునే జాగ్రత్తలు తెలుసుకొని నాటు కోళ్ల పెంపకం చేపడుతున్నాడు. మొదలు 1000 నాటు కోడి పిల్లలు తెచ్చి క్రమేపీ పెంచుకుంటూ నెలకు 1500 కోళ్లను అమ్మేస్థాయికి ఎదిగాడు.

### ఆరు నెలల్లో కిలో- కిలోన్నర బరువు..

నాటు కోడి పిల్లలను కొనుగోలు చేసి వీటిని ఏ రీతిలో పెంచితే లాభలు వస్తాయో గ్రహించి, ఆరు నెలల్లో మార్కెట్ లో అమ్మేవరకు రోజు వారి ఇవ్వాల్సిన దానాను కోడి పిల్లలకు అందిస్తుంటారు. కోడి కిలో నుండి కిలోన్నర బరువు పెరగ్గానే అమ్మితే కిలో దాదాపు రూ. 500 పలుకుతోంది. నాటు కోళ్లకు డిమండ్ బాగా ఉండటంతో రోజు కోళ్ల ఫారానికి వచ్చి కోళ్లను తీసుకెళ్తుంటారు.

### వ్యాపార పరంగా రాణించాలి..

వ్యాపార పరంగా రాణించాలనే తపనతో నాటు కోళ్ల పంపకం చేపట్టాను. ప్రత్యేక శ్రద్ధతో నాటు కోళ్ళ, పిల్లల పంపకం చేపడుతున్నాను. ప్రతి రోజు కోళ్ల ఫారానికి వచ్చి ప్రత్యేక శ్రద్ద తీసుకుంటాను. ఆరోగ్యంగా ఆరుబయట తిరుగడుతూ పెరుగుతున్న నాటు కోళ్లను చూస్తే తృప్తిగా ఉంటుంది.

కరిపే రాజు-మాక్లూర్.

# ప్రజాపాలనపై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఆర్మూర్/భీంగల్‌రూరల్/ఏర్గట్ల

వేల్పూర్ మండల విద్యా వనరుల కేంద్రంలో ఆదివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఎంఈఓ రేణుక ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోతెకు చెందిన ప్రభుకుమార్ సాధించగా, రెండో బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామన్నపేట విద్యార్థిని శ్రీనిత, మూడో బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం విద్యార్థిని ఆఫ్రా ఫిర్దోస్ గెలుపొందారు. కన్సోలేషన్ బహుమతులు శ్రీశాంత్, లక్ష్మీ ప్రసన్న, జోయ తారిన్, శివాన్విత, విజయ్, శ్రీనిధి, సంయజ్ఞ పొందారు. విజేతలకు మండల విద్యాధికారి రేణుక, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రాజన్న, గెజిటెడ్ ప్రధానోపధ్యాయులు రాంచందర్, పీఆర్టీయు ప్రధాన కార్యదర్శి సివి నరసింహారావు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, లక్ష్మణ్, లింబాద్రి, వినోద్ సదాశివ్, శ్యామ్, ఝాన్సీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**ఆలూరు ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు**

**ఆర్మూర్ :** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆలూర్ మండల విద్యాశాఖ అధికారి నరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన గురించి చక్కటి వ్యాసాలు రాసి ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో ఆలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ధనిక్ మొదటి బహుమతి, కీర్తన రెండో బహుమతి, కల్యెడ, గుత్ప విద్యార్థులు తృతీయ, కన్సోలేషన్ బహుమతులు పొంది విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో పిఆర్టీయు మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏర్గట్ల: పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత

**భీంగల్ రూరల్ :** ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల విద్యాధికారి ఆదేశాలనుసారంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) భీంగల్‌లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రజా సంక్షేమ పథకాలు - అమలు అన్న అంశాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో భీంగల్ మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నా రు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు మీడియాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో గట్టు ఈశ్వర్, ఎల్లుల్ల భూమేశ్వర్, ఉప్పల రాజేందర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మండల విద్యావనరుల కేంద్రం భీంగల్ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి స్వామి బహుమతులు ప్రధానం చేశారు.

**ఏర్గట్ల :** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన అనే అంశంపై మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంఈఓ ఆనంద్ రావ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కలెక్టర్, డీఈఓ ఆదేశానుసారం పోటీలను నిర్వహించామని, గెలుపొందిన విద్యార్థులకు బహు మతులను అందజేశామని అన్నారు. ఏర్గట్ల కాం ప్లెక్స్ హెచ్.ఎం. కృష్ణాచారి, తొర్తి హెచ్.ఎం.దశేంధర్, ఉపాధ్యాయులు భాస్కర్, మమత, నవనీత, వసంత పాల్గొన్నారు.

## ఉదయం వేళ వీధి దీపాల వెలుగులు



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు మామిడిపల్లి తిరుమల కాలనీలో ఆదివారం ఉదయం 11 అవుతున్న విద్యుత్ దీపాలు అలాగే వెలుగుతూ ఉన్నాయి. తిరుమల కాలనీ నుండి శ్మశాన వాటిక వైపు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు ఇలా వెలుగుతూ కనిపించాయి. ఇలా విద్యుత్ వృధా చేయడం ఏంటని కాలనీవాసులు అంటున్నారు. విద్యుత్ వనరులను ఆదా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## హత్య కేసులో ఇద్దరి అరెస్ట్, రిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 25న జరిగిన హత్య కేసులో శనివారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ బి.రఘుపతి తెలిపారు. ఈనెల 25న నగరంలోని సంతోష్ నగర్‌కు చెందిన వాస్టర్ రాజేష్(51) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాజేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా ఇద్దరు నేరస్తులను అరెస్టు చేశారు. నగరంలోని గరుద్వార్ గాజుల్ పేట్‌కు చెందిన రాంజీ భీమల్ బాడి ఏ1గా, అదే ప్రాంతానికి చెందిన షేక్ సికిందర్ ఏ-2గా అరెస్టు చేశారు. ఈ నెల 25న రాజేష్, రాంజీ భీమల్ బాడీ, షేక్ సికిందర్ ముగ్గురు కలిసి ముస్తయి దర్గా చౌరస్తా వద్ద మద్యం సేవించారు. అదే సమయంలో వీరి మధ్య గొడవ జరిగింది. ఇద్దరు కలిసి రాజేష్‌ను నెట్టేశారు. దీంతో రాజేష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడని విచారణలో తేలింది. ఇద్దరు నేరస్తులను అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

## ఇంగ్లీష్ తాత్కాలిక టీచర్‌కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల కేజీబీవీ పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ బోధించడానికి నాలుగు నెలల కోసం తాత్కాలిక పోస్టు (గెస్ట్ ఫ్యాకల్టీ)కింద మహిళా అభ్యర్థి అవసరం ఉందని,పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి గాను అభ్యర్థికి ఎంఏ ఇంగ్లీష్ తో పాటు బీఈడీ చేసి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెలకు 18 వేల రూపాయల వేతనం ఉంటుందని తెలిపారు.

## క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



క్రీడాకారుడికి బహుమతి అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో మహిళలు, పురుషలకు 30 సంవత్సరాలు పైబడిన వారికి ఐదు కిలోమీటర్ల రన్నింగ్, నడక, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, డిస్కస్‌తో తదితర పోటీలు ఆదివారం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వచ్చినవారు ఇది మంచి అనుభూతి అని, ఇలాంటి పోటీల్లో పాల్గొనడంతో వయసు మరిచిపోయామని, పిల్లల్లా పరిగెత్తామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జాతీయ అసోసియేషన్ నుంచి మర్రి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. గెలుపొందిన వారికి స్పోర్ట్స్ మెన్, ఏసిపి కందునూరి నాగయ్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శీను నాయక్, ప్రధాన కార్యదర్శి బద్దం గోపి, ట్రెజరర్ నీతు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్, దశరథ్, పితటిలు, స్పోర్ట్స్ మెన్, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలి

- నుడా చైర్మన్ కేశవేణు
- పద్మశాలి సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని గాజుల్ పేట్ రాంమందిర్ 13వ తర్ప పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం సంఘ భవనంలో అట్టహాసంగా జరిగింది.ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఎనగందుల సుభాష్, ఎనగందుల మోహన్, అచ్చుగట్ల నారాయణ, ఇతర కార్యవర్గంతో పద్మశాలి సంఘం నగర సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకట్ నర్సయ్య ప్రమాణస్వీకారం చేయించారు.. కార్యక్రమానికి ముఖ్యాతిథిగా నుడా చైర్మెన్ కేశ వేణు హాజరై ప్రసంగిస్తూ ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పద్మశాలీలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేందుకు తన వంతు సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నరాల రత్నాకర్,జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు డి.యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.రాజేశ్వరి, నగర సంఘం సంయుక్త కార్యదర్శి దాసరి గుండయ్య,13వ తర్పా గౌరవాధ్యక్షులు శ్రీరాం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పద్మశాలి సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

# స్వరాష్ట్ర సాధనలో తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/డిచ్‌పల్లి

తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్, 15వ వర్ధంతి కిష్టయ్య ముదిరాజ్ విగ్రహానికి ముదిరాజ్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహా సభ జిల్లా అధ్యక్షులు మెతుకు శివ కుమార్ మాట్లాడుతూ.. కిష్టయ్య 2009 డిసెంబర్ 1 న కామారెడ్డి పట్టణంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి తన తుపాకీతో కాల్చుకొని తెలంగాణ కోసం.. తొలి వీర మరణం పొందాడని గుర్తుచేస్తూ, తెలంగాణ తొలి అమరుడు గా పోలీస్ కిష్టయ్యని గుర్తించి ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కిష్టయ్య చిత్రపటం పెట్టాలని జిల్లా, పట్టణంలో పోలీసు కిష్టయ్య ముదిరాజ్ విగ్రహం ప్రతిష్టాపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహా సభ నిజామాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంబెం బాలరాజ్ ముదిరాజ్, మత్స్యకార విభాగం జిల్లా అధ్యక్షులు మచ్చ శ్రీనివాస్ ముదిరాజ్, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రవిరాజ్ ముదిరాజ్, జిల్లా సలహాదారులు సంఘమేశ్వర్ ముదిరాజ్, ధర్పల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రఘురాం ముదిరాజ్, ఇందల్వాయి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, మండల ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

**డిచ్‌పల్లి :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన పోలీస్ కిష్టయ్య వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి అధ్వర్యంలో కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఇందల్ వాయి మండలంలోని గౌరరం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాపూర్ స్టేజి వద్ద పోలిస్ కిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఇమ్మడి గోపి ముదిరాజ్ మాట్లాడుతూ పోలీస్ కిష్టయ్య కుటుంబాన్ని సైతం లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆత్మబలిదానం చేసుకున్నాడని అన్నారు. అంతకుముందు ముదిరాజ్ మండల కమిటీ పోలిస్ కిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సొసైటి చైర్మన్ మోచ్చ గోపాల్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ముదిరాజ్‌నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
సోమవారం | డిసెంబర్ 02, 2024 | www.navatelangana.com

## 2కే రన్‌ను ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్



**నవతెలంగాణ-కామారెడ్డి**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో 2కే రన్‌ను కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా 2కే రన్ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జగన్నాథం, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ సుధాకర్, అథ్లెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, స్పోర్ట్స్ పర్సన్స్ సుమారుగా 200 మంది పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ శాఖ స్వయంసేవకులకు బిస్కెట్లు పంపిణీ

**నవతెలంగాణ-మద్నూర్**

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో భగత్ సింగ్ శాఖ స్వయం సేవకులకు అనురాసనం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం విద్యార్థులకు బండి వార్ దత్తు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ సక్కర్లవార్, బోసివార్ ప్రకాష్, ఎక్స్ ఆర్మీ బాలాజీ, కాంబ్లె తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బిస్కెట్‌లు పంపిణీ చేస్తున్న పలువురు

# తొలి అమరుడు.. కిష్టయ్య

- పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి
- నివాళులర్పించిన పలువురు

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

తెలంగాణ ఉద్యమంలో తొలి అమరత్వాన్ని పొందిన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని ప్రతీ జిల్లా కేంద్రంలో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పలుచోట్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కామారెడ్డి :** పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా కామారెడ్డి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో పోలీస్ కిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కిష్టయ్య స్మారకార్థం ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులు, కలిసి కట్టుగా అమరులై వీరుల ఆశయాల సాధన కోసం ప్రతీ జిల్లా కేంద్రంలో ముందుండి నడిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాధన కోసమే ప్రాణాలర్పించిన ప్రజా వీరులను భవిష్యత్ తరాలకు అందించటానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పున్న రాజేశ్వర్, డాక్టర్ అసోషియేషన్ అధ్యక్షులు డాక్టర్ లింబాద్రి ముదిరాజ్, రాష్ట్ర జర్నలిస్టుల అధ్యక్షులు నీలకంఠం, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షులు బాలకృష్ణ, పట్టణ అధ్యక్షులు బాలరాజు, టీడీపీ నేత మహేష్, రమేష్, సత్యం, అల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ : కిష్టయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న పలువురు



లింగంపేట్ : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు



పొతంగల్‌లో...

**బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో..**

తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కామారెడ్డి కానిస్టేబుల్ కిష్టయ్య అని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా ప్రాంతంలోని కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ నాయక్, శ్రీధర్ శర్మ, రమేష్, రాజేందర్, మోహణాచారి, రవితేజ, ఆంజనేయులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**దోమకొండ :** మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద ముదిరాజ్ పెద్దమ్మ ఆలయం కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో కానిస్టేబుల్ కిష్టయ్య 15వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మలిదశ ఉద్యమకాలంలో ముదిరాజ్ జాతికి చెందిన కానిస్టేబుల్ కిష్టయ్య ప్రాణ త్యాగం వెల కట్టలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దోమకొండ ముదిరాజ్ సంఘం సభ్యులు అబ్రబోయిన స్వామి, నాగారపు ఎల్లయ్య, అబ్రబోయిన బాలయ్య, కమిండ్ల కృష్ణ, కడారి రమేష్, అబ్రబోయిన సిద్దారములు, రాజేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

**లింగంపేట్ :** పోలీసు కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ముదిరాజ్‌లు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పోస్టర్లను ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తొలి అమరత్వాన్ని పొందిన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని ప్రతీ జిల్లా కేంద్రంలో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కిష్టయ్య స్మారకార్థం ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులు, కలిసి కట్టుగా అమరులై వీరుల ఆశయాల సాధన కోసం ప్రతీ జిల్లా కేంద్రంలో ముందుండి నడిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాధన కోసమే ప్రాణాలర్పించిన ప్రజా వీరులను భవిష్యత్ తరాలకు అందించటానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు దాసరి సాయికుమార్, దురిశెట్టి అశోక్, ఉపాధ్యక్షులు బొల్లారం క్రాంతి కుమార్, మండల నాయకులు ఈర్ల శ్రీనివాస్, సంగమేశ్వర్, పర్వయ్య, కిషన్, సాయికుమార్, రాజారాం, బాలయ్య, శామంతుల వెంకటి, అనిల్ కుమార్, సాయిలు, సంగమేశ్వర్, సత్యం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**పొతంగల్ :** మండల కేంద్రంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసిన పోలీస్ కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు. అతని పోరాటం స్ఫూర్తిదాయకమని ముదిరాజ్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేశ్, హన్మాండ్లు, భూమయ్య, గంగారం, గోపాల్, శంకర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

**నవతెలంగాణ-పిట్లం**

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రూమ్ తండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజు కథనం మేరకు.. మండలంలోని రూమ్‌తాండకు చెందిన లలిత (30) కొంతకాలం నుంచి మానసిక స్థితి సరిగా లేక ఇదివరకే రెండు మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ క్రమంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చూయించారు. మానసిక స్థితి బాగోలేకపోవడంతో గత నెల 29న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఉమ్మడి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తల్లి చంగిభాయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**నవతెలంగాణ-తాద్వాయి**

ఏడుగురు పేకాట రాయుళ్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని చిట్యాల గ్రామ సమీపంలో సంజీవరెడ్డి వ్యవసాయ భూమిలో పేకాటాడుతున్నారన్న పక్కా సమాచారంతో శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నారు. సంతాయిపేట్ గ్రామానికి చెందిన పలువురిని పట్టుకొని వారి వద్ద ఉన్న పేక ముక్కలతో పాటు రూ.13,130 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం

- తహసీల్దార్ రేణుక చౌహన్, ఆర్ఐ వెంకట్ స్వామి

**నవతెలంగాణ-మద్నూర్**

డోంగ్లి మండల పరిధిలోని మంజీరా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలు సీజ్ చేస్తామని, భారీగా జరిమానాలు విధిస్తామని డోంగ్లీ తహసీల్దార్ రేణుక చౌహన్, ఆర్ఐ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. శనివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకుని ఆ వాహనాన్ని సీజ్ చేసినట్లు వారు తెలిపారు. డోంగ్లి మండల పరిధిలోని సిర్పూర్, మదన్‌హిప్పర్గ, కుర్లా గ్రామ శివారు పరిధిలోని మంజీరా నది నుంచి రాత్రి వేళల్లో ఇసుక అక్రమంగా తరలివెళ్తున్నట్లు నిఘా పెట్టనున్నట్టు వివరించారు.

## బోధన్ పట్టణ పద్మశాలి కమిటీ అధ్యక్షులుగా సంతోష్



సన్మానించిన పలువురు

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా సంతోష్ ఎన్నికయ్యారు. ఆదివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్ మహేష్, కోశాధికారిగా బిల్ల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మునిగిరి నవీన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌లుగా శ్యామల శివ కుమార్, చింతకింది రమేష్, కలకొకల నవీన్, మోత్యూరు స్వరూప, కార్యదర్శిగా బేతి గంగారాం, గంగుల శ్యామ్, చిలుక విజయ్, నిగ్గ రమాదేవిని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పులగం హన్మాండ్లు, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, చేనేత ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీనివాస్, ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య, మాజీ కౌన్సిలర్ దాము, వీడీసీ చైర్మన్ గంగాధర్ పట్వారీ, జిల్లా మెంబర్ లోల శంకర్, పట్టణ మాజీ అధ్యక్షుడు గంగుల దాస్, చిలుక రాములు, గంగుల లక్ష్మణ్, ఆడెపు శంకర్, రాములు, బేట్ల రాజు, సత్యం, గుర్రం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలతో మేధోశక్తి



బహుమతిని అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

**నవతెలంగాణ-పిట్లం**

వ్యాసరచన పోటీలతో విద్యార్థులకు మేధోశక్తిని కలుగజేస్తాయని బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు రూప్ సింగ్ అన్నారు. ఆదివారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అరుణ, సంధ్యారాణి, రమేష్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు

**నవతెలంగాణ-బోధన్**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం బోధన్ మండలంలో ప్రజాపాలన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మండల స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి అభ్యసనం అవసరమని పట్టుదల కలిగి నిరంతర శ్రమ చేయాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, హెచ్ఎం సూర్యకుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు నగేష్, చక్రవర్తి, సిఆర్‌పి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకునిపై డిసిసికి ఫిర్యాదు

**నవతెలంగాణ-రామారెడ్డి**

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన ఇర్షాద్‌పై పోసానిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్ రెడ్డి డిసిసి అధ్యక్షులు కైలా శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. గత 40 సంవత్సరాల నుంచి ఎందరో ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో గెలిచి పార్టీ ఫిరాయించినా, మొక్కవోని ధైర్యంతో పార్టీ కోసం జెండాలు మోసి, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ప్రధాన అనుచరుడు ఇర్షాద్ నాతోపాటు, మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తూ, వ్యక్తిగత, పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తూ మాట్లాడడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన జడ్పిటిసిలు పార్టీలు మారినా.. రామారెడ్డి జెడ్పిటిసిగా గెలిచి, థాయిలాండ్లకు తలవంచకుండా, భయభ్రాంతులకు భయపడకుండా జిల్లాలో కాంగ్రెస్ వాణిని వినిపించిన నాయకునిపై ఖబర్దార్ అనే పాదముతో బెదిరింపు చేయడం పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చర్యలు తీసుకొని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

# హలో మాల.. చలో హైదరాబాద్

- బహిరంగ సభకు భారీగా తరలిన మాలలు

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాల సింహ గర్జన సభకు పలు మండలాల నుంచి నాయకులు ఆదివారం వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.

**గాంధారి :** మండలం నుంచి మాలలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మాలలు భారీ సంఖ్యలో హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు చంద్రకాంత్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఆపాలని, ప్రభుత్వం మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బక్కుల సాయిలు, చంద్రకాంత్, పోశయ్య, గంగాధర్, బాల వీరయ్య, సాయిలు, కిష్టయ్య నాయక, చిన్న పోశయ్య, పెద్దరాజు, రాజయ్య, సంతు లక్ష్మయ్య తదితరులు తరలివెళ్లారు.

**బోధన్ :** హైదరాబాద్‌లో జరిగే సింహగర్జన సభకు బోధన్ డివిజన్ నుంచి మాలమహానాడు నాయకులు ఆదివారం వాహనాల్లో తరలివెళ్లారు. ముందుగా బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హైదరాబాద్ సింహగర్జన సభకు తరలినవారిలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు ఎల్లమ్మయ్య, బోధన్ డివిజన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యక్షులు కారం స్వామి, సలహాదారులు కొంద్రా వెంకటి, పాండు, సూర్యకాంత్, సంజీవ్, వివిధ మండల అధ్యక్షులు రాహుల్, శ్యామ్, దాసు, పల్లాటి యాదగిరి, విట్టల్, పెరక స్వామి, ఆకుల ఎల్లమయ్య, పెరుక రామకృష్ణ, బాలకృష్ణ, అశోక్, టీమ్ నాయకులు విట్టల్ ఉన్నారు.



గాంధారి : బహిరంగ సభకు తరలిన మాలలు




సదాశివనగర్‌లో...

**సదాశివనగర్ :** మండలంలోని ప్రతి గ్రామం నుంచి హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సింహగర్జనకు ఆదివారం బయలు దేరారు. ప్రతి గ్రామంలో సొంత ఖర్చులతో వాహనాలు ఏర్పాటు చేసుకుని బయలుదేరారు.

**లింగంపేట్ :** మాలల సింహగర్జనకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాల సంఘం నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి మాల కులస్తులు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలవేసి తరలివెళ్లారు. తరలిన వారిలో మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, మాజీ వైస్ ఎంపీపీ సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ బండి రాజన్న, అంబేద్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్ల సురేందర్, లింగంపేట్ నాయకులు సాయిబాబా, ముదం రవి, విఠల్, స్వామి, బ్యాగారి ఉషయ్య, నాగయ్య, సాయిలు, బాలరాజు తదితరులున్నారు.

**మద్నూర్ :** మద్నూర్, డోంగ్లి మండలాల నుంచి మాలలు వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మాలల అధ్యక్షులు ఆకాష్ ఆధ్వర్యంలో హలో మాల చలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివెళ్లి బహిరంగ సభ విజయవంతం చేసినట్టు మాలల అధ్యక్షులు తెలిపారు.

**తాద్వాయి :** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాల నాయకులు సింహ గర్జన సభకు తరలివెళ్లారు. మండలం నుంచి 12 వాహనాల్లో సుమారు 1000 మంది వెళ్లినట్లు తెలిపారు. తరలినవారిలో గోల్కొండ రాజయ్య, గైని చిన్న రాజయ్య, గోల్కొండ స్వామి, బాలయ్య, రవి, రామస్వామి, గని చంద్రం, దొడ్డి బాలరాజ్, గోల్కొండ స్వామి దొడ్డి సంతోష్, దితరులు ఉన్నారు.

**ఎడపల్లి :** మండలంలోని ఎడపల్లి, జంలం, పోచారం, కుర్నాపల్లి, జానకంపేట, ఏఆర్‌పి క్యాంప్, ధర్మారం తదితర గ్రామాల నుంచి మాల మహానాడు గ్రామ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో హైదరాబాద్ తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గైని పోచయ్య, బేగరి సాయిలు, సాయిబాబా, కుర్నపల్లి మాల మహానాడు గ్రామ కమిటీ అధ్యక్షులు ఇప్ప సాయిలు, నాయకులు, తదితరులు హైదరాబాద్ బయలుదేరిన వారిలో ఉన్నారు.

## మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి

- షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



షబ్బీర్ అలీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

**నవతెలంగాణ-నిజాంసాగర్**

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు బింగి శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ప్రకటించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి రెగ్యులర్ చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఆరోగ్య బీమా ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జేఏసీ అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి సంపత్, సభ్యులు కాళిదాస్, రాము, లింగం, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షులు దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డు

**నవతెలంగాణ-కామారెడ్డి**

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ బాలు ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డును ఆదివారం అందుకున్నారు. 74 సార్లు రక్తదానం, తలసేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాల నిర్వహిస్తున్నందుకు గాను ఈ అవార్డు ఆయనను వరించింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల సమావేశ మందిరంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగతంగా 74 సార్లు రక్తదానం చేయడమే కాకుండా, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాల నిర్వహించడం, ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ 17 సంవత్సరాలుగా రక్తదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు గానూ ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డు 2024ను ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలుకు అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని సకాలంలో రక్తం దొరకక చాలామంది ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. రక్తదానానికి యువత ముందుకు రావాలని, ఈ అవార్డు రావడానికి సహకరించిన ప్రాజెక్టు అధికారి సుధాకర్, నాగరాజుకు, రక్తదాతలకు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి

- ఎడపల్లి పీఏసీఎస్ చైర్మన్ పోల మల్కారెడ్డి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ పోల మల్కారెడ్డి

**నవతెలంగాణ-ఎడపల్లి**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం పండగ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడపల్లి పిఎసిఎస్ చైర్మన్ పోల మల్కారెడ్డి మాట్లాడారు. వరి ధాన్యానికి మద్దతు ధరతో పాట, క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్దిరాములు, ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్, వ్యవసాయశాఖ విస్తీర్ణ అధికారులు జ్యోతి, హరీష్, ఎడపల్లి మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, అంబం.వై మాజీ ఉపసర్పంచ్ సున్నపు ఒడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆరు తడి పంటల పరిశీలన


**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి ఆదివారం నాడు జుక్కల్ నియోజకవర్గం లోని కౌలాస్ నాలా ప్రాజెక్టుకు దిగువన ఉన్న విట్టల్వాడి, సావరగవ్ గ్రామాల శివారులలోని కందులు, జొన్నలు, పెసర్లు,గోధుమలు తదితర ఆరుతడి పంటలను పరిశీలించారు. ఆరుతడి పంటలతో ఎల్లారెడ్డి ప్రాంత రైతులు కూడా అధిక లాభాలు పొందవచ్చని ఆరు తడి పంటల సాగును ప్రోత్సహించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దిశా డైరెక్టర్ దేశముఖ్ రాజు, జాతీయ బీసీ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్,మాజీ ఎంపిటిసి శకావత్ అలీ, మాజీ సర్పంచులు శ్రీనివాస్, రెడ్డి సంజీవరెడ్డి,గఫర్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోకి నూతన పోలీస్ సిబ్బంది

**నవతెలంగాణ-ఎడపల్లి**

ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా ఏడుగురు కానిస్టేబుళ్లు ఆదివారం నూతనంగా విధుల్లో (రిపోర్ట్) చేరినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. కానిస్టేబుళ్లు నారాయణ రావు, సాయి, రణధీర్, సుస్మిత, హేమంత్‌కుమార్, సిమ్రాన్ నూతనంగా విధుల్లో చేరిన పోలీస్ సిబ్బందికి ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణరెడ్డి విధి విధానాలు, విధుల నిర్వహణ పనితీరుపై ఆయన అవగాహన కల్పించారు. ఆయన వెంట స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఎస్సైకు రిపోర్ట్ చేస్తున్న నూతన పోలీస్ సిబ్బంది

## 4న సరస్వతీరాజ్ పురస్కారాలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఈనెల 4న నవ్య భారతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో జరిగే హరిదా రచయితల సంఘం 6వ మహాసభలో సరస్వతీరాజ్ పురస్కారాలను అందజేస్తున్నట్టు హరిదా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు తిరుమల శ్రీనివాస్ ఆర్య తెలిపారు. ఆదివారం ఇందూరు యువత కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరస్వతీరాజ్-హరిదా తెలంగాణ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రఖ్యాత విమర్శకులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, జిల్లాస్థాయి సాహిత్య పురస్కారాలను ప్రముఖ కవయిత్రులు అన్నం పద్మజారెడ్డి, కామినేని రేణుక, మఠం సుజాత, ప్రముఖ కవులు బహు గ్రంథకర్త మల్లవరపు చిన్నయ్య, నవలా రచయిత డాక్టర్ పొత్నూరి లక్ష్మణ్‌కు అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని డిసెంబర్ 4న నవ్య భారతి గ్లోబల్ స్కూల్లో జరిగే ఈ కార్యక్రమంలో సాహితీమూర్తులు సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దారం గంగాధర్, పంచరెడ్డి లక్ష్మణ్, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ సురేష్ రెడ్డికి కృతజ్ఞతలు

- ఢిల్లీవెళ్లి కలిసిన రైతులు

**నవతెలంగాణ-కమ్మర్ పల్లి**



మండలంలోని హాస కొత్తూర్, చౌట్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఆదివారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యులు కేఆర్.సురేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో పసుపు బోర్డు ఏర్పాటు కోసం బిల్లు ప్రవేశపెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, నిజామాబాద్ జిల్లా రైతుల తరఫున సురేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సురేష్ రెడ్డిని కలిసిన వారిలో చౌట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, న్యాయవాది, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఏలేటి గంగాధర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, పలువురు రైతులు ఉన్నారు.

# ప్రజా విజయోత్సవ వేడుకలు ప్రారంభం

- తొలిరోజు సంక్షేమ పథకాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీసులు

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**కమ్మర్‌పల్లి :** మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యాచరచన పోటీలను ఆదివారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాచరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన జె.శాలిని ప్రథమ బహుమతి గెలుపొందగా, కోన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కే.రుచిత ద్వితీయ బహుమతిని, కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మహేష్ తృతీయ బహుమతిని గెలుపొందారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి ఆంధ్రయ్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హాస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్, ఉపాధ్యాయులు రాజేశ్వర్ గౌడ్, సల్లూరి కిషన్ గౌడ్, జి.రమేష్, జి.దేవదాస్, నరేందర్, సబిత, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

**ముప్కాల్:** ప్రజాపాలన విజయోత్సవ' కార్యక్రమంలో భాగంగా స్థానిక కేజీబీవీ పాఠశాలలో ముప్కాల్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు ఎంఈఓ రవికుమార్ తెలిపారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో గౌస్ మొహినుద్దీన్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గంగారం, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జి.వినోద సిఆర్పి సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**మాక్లూర్ :** మండలంలోని మానిక్ బండార్ ప్రభుత్వ పాఠశాలలో ప్రజపాలనపై విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలకు 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి జే. సాత్విక్ పదవ తరగతి మాక్లూర్, రెండవ, మూడవ బహుమతి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల మాక్లూర్ పదవ తరగతి ఎల్ అక్షయ, అర్. వర్షా గెలుపొందారు. గెలుపొందిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓల్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బాల్కొండ :** ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యా దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో విద్యాభివద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గణనీయ మార్పులు తీసుకొచ్చిందన్నారు. డైట్ చార్జీల పెంపు, అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు, పారిశుద్ధ్య కార్మికుల నియామకం తదితర, పాఠశాలలను బలోపేతం చేయడానికి నూతన ఉపాధ్యాయుల ఏర్పాటు, ప్రమోషన్స్ , మధ్యాహ్న భోజన చార్జీల పెంపు తదితర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండకు చెందిన భవిత ప్రథమ స్థానంలో నిలువగా, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన రాజేశ్వరి ద్వితీయ, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థినులు సహస్ర శోధిత తతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ నగర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రాజేంద్రకుమార్, బాల్కొండ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాల్కొండలో..





కమ్మర్‌పల్లిలో..

## తైక్వాండో విజేతలకు సర్టిఫికెట్స్ అందజేత

**నవతెలంగాణ-ఆర్మూర్**

తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ పోటీల్లో గ్రాండ్ మాస్టర్ కరాటే భోజన్న ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రజ్ఞ ఐఐటి స్కూల్ ఆవరణలో 68 మందికి తైక్వాండో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు చార్టెడ్ ఆఫ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ పాల్గొని విజేతలకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఇందులో శ్రీ చంద్ర టెక్నో స్కూల్ విద్యార్థులు 20 మంది ఎల్లో బెల్ట్, 17 మంది ఎల్లో వన్, 6 గ్రీన్ బెల్ట్ నసీరొద్దీన్,ఆరూఫ్,కశఫ్, అరియాన్ గ్రీన్ వన్,రాజు అర్జున్ బ్లూ వన్, బెల్ట్ లు పొందారు. విజేతలందరినీ అధ్యక్షులు రాజశేఖర్ ప్రధాన కార్యదర్శి కరాటే భోజన్న, తార తదితరులు అభినందించారు.

## సిద్దుల గుట్ట అయ్యప్ప ఆలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదానం



నిత్యాన్నదానంలో పాల్గొన్న స్వాములు

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలోని సిద్దుల గుట్ట వద్ద గలఅయ్యప్ప ఆలయంలో మున్సిపల్ చైర్మన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ ఏర్పాటు చేసిన అయ్యప్ప మాలదారులకు నిత్యాన్నదానం కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ సొంత డబ్బులతో ఆలయం నిర్మించి, ప్రతి సంవత్సరం మాలదారులకు నిత్య న్నదానం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వడ్ల దొంగలు రిమాండ్

**నవతెలంగాణ-మోర్తాడ్**



పట్టుకున్న వడ్ల సంచులు

పలు మండలాల్లో వడ్ల బస్తాలు దొంగతనం చేస్తున్న దొంగలను పట్టుకున్నట్లు మోర్తాడ్ ఎస్సై విక్రం తెలిపారు. ఎర్ర గంగాధర్ గత నెల 28న వడ్ల దొంగతనానికి గురైనట్లు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల నుండి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు రాత్రి సమయంలో ఆటోలో వడ్లను తరలిస్తుండగా పలువురిని పట్టుకొని విచారించామన్నారు.

కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, బాల్కొండ మండలాల్లో వరి బస్తాలను దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. బోదాసు మహేందర్, బత్తుల సుమన్, అలకుంట శ్రావణ్ ముగ్గురిని పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరి నుండి వడ్ల సంచులను రికవరీ చేసినట్లు తెలిపారు.

## వాహనం ఢీకొని రైతు మృతి

**నవతెలంగాణ-ఆర్మూర్**

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన రైతు సిరిపురం అశోక్‌రెడ్డి (55) ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా 44 జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉండగా వీరిద్దరి వివాహాలు జరగడంతో అమెరికాలో స్థిరపడ్డారు. వీరు స్వదేశానికి వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సమీపంలో గల రిలయన్స్ పెట్రోలు బంకు, టోల్ గేట్ వద్ద సిసి కెమెరాల ఫుటేజ్ ద్వారా పరిశీలించనున్నారు. కాగా సంఘటన స్థలాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్, ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అందరితో కలుపు గోలుగా ఉండే ఆయన మృతితో పెర్కిట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మొరం అక్రమంగా తరలింపు

- అడ్డుకున్న యువకులు



పట్టుకున్న మొరం టిప్పర్

**నవతెలంగాణ- నవీపేట్**

మండలంలోని నాగేపూర్ శివారు గుట్టల నుండి సెలవు రోజు ఆదివారం మొరం తరలిస్తుండగా నాగేపూర్ యువకులు అడ్డుకున్నారు. ప్రభుత్వ అభివద్ధి పనుల కోసం అనుమతులు లేకుండా అక్రమంగా సెలవు రోజులలో తరలించడం పట్ల యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మొరం టిప్పర్లను అడ్డుకొని తహసిల్దార్ వెంకటరమణకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లగా ప్రభుత్వ పనులకు తరలిస్తున్నామని సంబంధిత కాంట్రాక్టర్ సూచించడం, అధికార పార్టీ నేత కాంట్రాక్టర్ కావడంతో వెనుతిరగడం గమనార్హం.

## క్రీడలకు, క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

**నవతెలంగాణ-ఆర్మూర్**

కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు క్రీడాకారులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. 46వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షులు గంగా మోహన్ చక్రు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే నూతన క్రీడా పాఠశాలలను ప్రారంభిస్తామని, నిజామాబాద్ బాక్సింగ్ క్రీడాకారిని నికిత్ జరీన్‌కు పోలీస్ డిపార్ట్‌మెంట్లో ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని కల్పించారని అన్నారు. త్వరలో నిర్వహించబోయే సీఎం కప్ విజయవంతం చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు తెలిపారు. పట్టణంలో నూతన స్టేడియం నిర్మించడానికి త్వరలోనే కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పూల్ కూడా ఆర్మూర్లో నిర్మిస్తామని,

మినీ స్టేడియాన్ని కి త్వరలోనే మరమ్మత్తులు నిర్వహించి పూర్తిస్థాయిలో వినియోగానికి సిద్ధం చేస్తామని తెలిపారు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేసినారు. ఆదిలాబాద్ జిల్లా జట్టు క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలువగా, మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. తతీయ స్థానంలో వరంగల్, ఫోర్త్ ప్లేస్ రంగారెడ్డి జిల్లా జట్టు నిలిచాయి. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ వన్నెల దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ , కౌన్సిలర్ ఫయాజ్, మేడిదాల రవి గౌడ్, సి ఏ రాజశేఖర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గాటాడి రాజేష్, హవార్డ్ పార్క్ కరస్పాండెంట్ బాబురావు, జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న శివసేనరెడ్డి

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వేంపల్లిలో చెక్కులు అందజేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ముప్కాల్**

మండలంలోని వేంపల్లి, నాగంపేట్ గ్రామాల్లో ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన బాధిత లబ్దిదారుల కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి, నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, గ్రామ శాఖ అధ్యక్షులు చిన్న గంగారాం, మేడిపల్లి ముత్యం రెడ్డి, శ్రీకాంత్, మల్లేష్ యాదవ్, వేంపల్లి గ్రామ యూత్ అధ్యక్షులు నరేష్ యాదవ్, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు మల్లయ్య యాదవ్, సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, యూత్ నాయకులు దనేశ్ యాదవ్, రామకష్ణ పాల్గొన్నారు..

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని కొన సముందర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఆదివారం అందజేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన రజియా భేగంకు రూ. 42వేలు, జగసంద్రం భిక్ష పతికి రూ.10వేల 500, పాల లక్ష్మీ కి రూ.50వేలు, సుర స్రవంతికి రూ.18వేలు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి ద్వారా చెక్కులు మంజూరు అయ్యాయి. ఆ చెక్కులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జైడి శ్రీనివాస్, నాయకులు భూమా రెడ్డి, గట్టు హనుమల్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు బట్టల సతీష్, పేరం సుధాకర్, సోమేష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## మాలల సింహగర్జనకు తరలిన నాయకులు

**నవతెలంగాణ-బాల్కొండ/కమ్మర్‌పల్లి**

సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన హలో మాల చలో హైదరాబాద్ "మాలల సింహ గర్జన" కార్యక్రమానికి మండల కేంద్రానికి చెందిన వంద మంది మాల సంఘం సభ్యులు బయలుదేరి వెళ్లారు.

**కమ్మర్‌పల్లి :** హలో మాల... చలో హైదరాబాద్ పేరుతో నిర్వహించిన మాలల సింహ గర్జన మహాసభకు మండలంలోని ఆయా గ్రామాల నుండి ఆదివారం మాల సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. క్రిమిలేయర్, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాల సింహగర్జన మహాసభకు మండలం నుండి పలు వాహనాల్లో మాల సంఘ సభ్యులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బషీరాబాద్‌లో మాల సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మహాసభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాల సంఘం అధ్యక్షులు పార్వతి రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో భాగంగా మాలలు ఎక్కువ సంఖ్యలో లేరని తప్పుడు లెక్కలు చూపారన్నారు. మాలలు మాదిగల కంటే ఎక్కువగా ఉన్నారని నిరూపించాలనే హైదరాబాద్ లో ఈ మాల సింహగర్జన మహాసభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తరలి వెళ్లిన వారిలో శంకర్, పురుషోత్తం, ప్రసాద్, సతీష్, శివ, ఆనంద్, శ్రీనివాస్, కుల సభ్యులు ఉన్నారు.

# రాజకీయం కోసమే మాలల మధ్య వైశమ్యాలు

- మాదిగ జేఏసీ
- ఎమ్మెల్యేల దిష్టిబొమ్మ దహనం

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పేరుతో ఆదివారం హైదరాబాద్‌లో జరిపిన మాలల సింహ గర్జన కేవలం మాల మనువాదులు వారి రాజకీయ భవిష్యత్తు కోసం మాల మాదిగ, ఉప కులాల మధ్యన వైశ్యామ్యాలు రెచ్చగొడుతున్నారని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు బరికుంట శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు బరికుంట శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో మాల ఎమ్మెల్యేలు జి. వివేక్ వెంకటస్వామి, మల్లు రవి, కేఆర్. నాగరాజ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా మాలలు ఈ రాష్ట్రంలో అంబేద్కర్ సాధించిన 15శాతం రిజర్వేషన్లు ఏకపక్షంగా అనుభవిస్తూ దళితుల్లో ఉన్న మాదిగ, ఉప కులాలకు అందకుండా చేస్తున్నారనే 30 ఏళ్లుగా దళితుల్లో వర్గీకరణ జరగాలని అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్లు అందరూ సమానంగా పంచుకోవాలని ఉద్యమం చేస్తున్నామన్నారు. కేవలం మాలల్లో ఉండే కొంతమంది ఇలాంటి మనువాదులు రిజర్వేషన్లు మొత్తం మేమే అనుభవిస్తామనే పద్ధతిలో సభలు సమావేశాలు పెడుతూ మాలలను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఈ ముగ్గురు మనువాదులు ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని, 1965 లోనే కాంగ్రెస్ పార్టీ వర్గీకరణకు అనుకూలంగా లోకూర్ కమిషన్ వేసిందని తెలిపారు. 1975 లోనే పంజాబ్‌లో వర్గీకరణ చేసింది కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉషా మెహ్రా కమిషన్ వేసి, అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. రాహుల్ గాంధీ కూడా వర్గీకరణకు అనుకూలంగా ఢిల్లీలో మాదిగ జాతి వేదికలపై వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. 2024 ఎలక్షన్ మేనిఫెస్టోలో వర్గీకరణ చేస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 1 న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేసి మాదిగ ఉప కులాలకు న్యాయం చేస్తామని చెప్పారని తెలిపారు. అయినా ఈ ముగ్గురు మనువాదులు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ మాల మాదిగలు, ఉప కులాల మధ్యన చిచ్చు పెడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని వీరిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, వర్గీకరణ చేసి మాదిగ మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా నాయకులు మల్లాని శివ, కొత్తపేట రమేష్, ప్రకాష్, అన్న బాహు సాటి సంగం జిల్లా అధ్యక్షులు గంగాధర్ గైక్వాడ్, మేనత్ కర్ శంకర్, గైక్వాడ్, హరీష్ మాదిగ జేఏసి జిల్లా నాయకురాలు బాయికాడి లత, సువర్ణ, సమత, శ్రీదేవి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం

**నవతెలంగాణ-బాల్కొండ**

మండల కేంద్రంలోని వి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి 2000-2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అప్పుడు విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులు హాజరై పూర్వ విద్యార్థులతో ముచ్చటించారు. పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. 25 వసంతాల ఆత్మీయక కలయిక చదువులమ్మ గుడిలో ఆడి పాడి చదివిన మధురస్మతులు యాది చేసుకుంటూ పాఠశాలలో విద్య, శ్రేయస్సుకు సంబంధించిన ఎన్నో స్ఫూర్తిదాయక క్షణాలను పున్హస్మరించుకున్నారు. అనంతరం సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. చదువు నేర్పిన గురువులకు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.



ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జిని కలిసిన నాయకులు

**నవతెలంగాణ-ఆర్మూర్**



ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ఇంచార్జ్ దీపా దాస్ మున్షి ని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు మహిళ అధ్యక్షురాలు కూరపాటి అరుణ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సోనియ గాంధీ ఆదేశాలమేరకు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్ట్ ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ తరపున మద్దతు తెలిపామని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం నర్స రెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎర్ర రాకేష్ (దేగాం), నూత్పల్లి భాగ్య , విజయ తదితరులు పాల్గొన్నారు.

## 4న రక్తదాన శిబిరం

**నవతెలంగాణ-ముప్కాల్**

మండల కేంద్రంలో ఈ నెల 4న పూసవర్ల సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్గనైజింగ్ సభ్యులు పి.శ్రీధర్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పూసవర్ల సంఘం పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

5
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | డిసెంబర్ 02, 2024 | www.navatelangana.com

## వ్యసనాలకు బానిసై యువకుడు ఆత్మహత్య

**నవతెలంగాణ-లింగంపేట్**

చెడు వ్యసనాలకు బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పొల్కంపేట్ గ్రామానికి చెందిన బాసు అనిల్ (35) భార్య తన పుట్టింటికి వెళ్లింది. తిరిగి రాకపోయేసరికి ఒంటరిగా జీవిస్తున్నాడు. ఒంటరి జీవితం భరించలేక జీవితంపై విరక్తి చెంది పరుమార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇదిలా ఉండగా.. గత నెల 28న రాత్రి తన బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు అనిల్ ఆచూకీ కోసం వెతుకుతుండగా పోల్కంపేట గ్రామ శివారులో గల వాగులో మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఎంపీ సురేష్ షెట్కార్ పూజలు



**నవతెలంగాణ-కామారెడ్డి**

శ్రీగౌరీ సమేత ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కార్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ షబ్బీర్ అలీ, సురేష్ షెట్కార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనే శ్రీనివాస్, గడుగుల శ్రీనివాస్, కామారెడ్డి మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, నౌసి నాయక్, బిబిపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్, అనంతరెడ్డి, కారంగుల అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంకర వేశారు.. వదిలేశారు

- ప్రారంభించి 20 నెలలైనా అంతే.. పూర్తికాని డబుల్ రోడ్డు పనులు
- నిత్యం దుమ్ము, ధూళితో సావాసం
- రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందినా పట్టించుకోని అధికారులు





రోడ్డుపై కంకర వేసి ఉండటంతో ఎగిసిపడుతున్న దుమ్ముతో ప్రయాణికులకు ఇబ్బందులు

**నవతెలంగాణ-గాంధారి**

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయి. మండలంలోని పెద్దపొతంగల్ గ్రామ స్టేజీ నుంచి మేడిపల్లి వరకు చేపట్టిన రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించి 20 నెలలు గడుస్తున్నా.. మూడు కిలోమీటర్ల మేర పనులు పూర్తికాకపోవడం గమనార్హం. ఈ మూడు నెలల్లో రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ అధికారులు సంబంధిత పనులను పూర్తి చేయించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

మండలంలోని పెద్దపొతంగల్ గ్రామ స్టేజీ నుంచి మేడిపల్లి వరకు డబుల్ రోడ్డు పనులను గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. సుమారు 14 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు నిర్వహించి పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. అయితే గత ఎనిమిది నెలలుగా మూడు కిలోమీటర్ల పనులు కొనసాగుతూనే ఉన్నాయి. గత సంవత్సరం జూన్‌లో ప్రారంభమైన పనులు మార్చ్ నెల వచ్చినా ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. దీంతో గత ఎనిమిది నెలలుగా ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశాడు. గత మూడు నెలలుగా ఎలాంటి పనులు కొనసాగడం లేదు. కంకర వేసి వదిలేయడంతో ఆ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మధ్యకాలంలో వాహనాలు అదుపుతప్పి ఇద్దరు మృతిచెందారు. అయినా కాంట్రాక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కంకర వేసి వదిలేయడంతో ఆ మూడు కిలోమీటర్ల ప్రయాణంలో దుమ్ము లేవడంతో ప్రయాణం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఈ రోడ్డు గుండా పెద్ద వాహనాలు వెళ్లడంతో వెనుక వెళ్లే వారికి దుమ్ముతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. దుమ్ము లేవడంతో ముందు ప్రయాణించే వాహనంతో పాటు రహదారి సైతం కనిపించడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు స్పందించి పనులు త్వరగా చేపట్టాలని కోరుతున్నారు. అలాగే ప్రస్తుతం కంకరపై కనీసం నిత్యం నీరు పట్టేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

## లక్ష్యంతోనే వందశాతం విజయం

- మాజీ సర్పంచ్ బండారి సంజీవులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మాజీ సర్పంచ్

**నవతెలంగాణ-తాడ్వాయి**

విద్యార్థినీలు ఏ రంగాల్లోనైనా లక్ష్యం ఏర్పరచుకుంటే వందశాతం విజయం సాధించవచ్చని మాజీ సర్పంచ్ బండారు సంజీవులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న మోటివేషన్ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. జీవిత లక్ష్యం విద్యార్థిని దశనుంచే ఎంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు తరగతులు బోధించే సమయంలో ఏకాగ్రత పాటిస్తే వందశాతం మార్కులు వస్తాయని అన్నారు. నిత్యం విద్యార్థి తనకు అవసరమైన పనులకు సమయం ఎలా కేటాయిస్తారో చదువుకోవడానికి సైతం సమయం వెచ్చించాలని సూచించారు. దీంతో విజయం సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ అంతక్రియల్లో ఎమ్మెల్యే



శ్రీధర్‌గౌడ్ పాడె మోస్తున్న ఎమ్మెల్యే

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణి గ్రామ మాజీ ఎంపీటీసీ శ్రీధర్ గౌడ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో మృతిచెందారు. ఆయన వైద్యానికి అయిన మొత్తం ఖర్చులు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కిమ్స్ ఆసుపత్రిలో చెల్లించి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు ఇప్పించారు. అనంతరం ఆదివారం అంత్యక్రియల్లో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. అంతిమయాత్రలో పాల్గొని పాడే మోశారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ జెడ్పిటిసి గయాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



బోల్తాపడిన ట్రాక్టర్



ఇర్వంత్ మృతదేహం

**నవతెలంగాణ-బిచ్కుంద**

కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో హస్గుల్ గ్రామానికి చెందిన కామ ఇర్వంత్ (42) అనే వ్యక్తి మృతిచెందాడు. హస్గుల్ గ్రామానికి చెందిన రైతు తన పొలంలో పొగాకు బట్టి పెట్టేందుకు ట్రాక్టర్‌లో కట్టెల లోడు తీసుకొస్తూ ఉండగా గోపన్‌పల్లి గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇర్వంత్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా ట్రాక్టర్ నడిపిస్తున్న డ్రైవర్ అక్తర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వ్యవసాయం పని చేస్తూ జీవిస్తున్న కామ ఇర్వంత్ చనిపోవడంతో ఆయన కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

## 6న బైక్ యాత్ర ర్యాలీని విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రుసేగం భూమయ్య

**నవతెలంగాణ-కామారెడ్డి**

6న జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమయ్యే బైక్ యాత్ర ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రుసేగం భూమయ్య పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రూసేగం భూమయ్య ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైకు ర్యాలీని జయప్రదం చేయడానికి మాదిగ, మాదిగ ఉపకులాలు కలిసి రావాలని కోరారు. జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమై అన్ని మండలాల మీదుగా డిసెంబర్ నెల మొత్తం కొనసాగే బైక్ యాత్రను మాదిగ జాతి ఉపకులాలు చైతన్య కోసం 59 ఉప కులాలు జనాభా నిష్పత్తి ప్రకారం ప్రతి గ్రామం నుంచి జాతిని మేలుకొలుపుతూ యాత్రను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో భూమయ్య, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పెన్షన్‌ను బకాయిలతో సహా వెంటనే చెల్లించాలి

- వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

**నవతెలంగాణ-కామారెడ్డి**

పెంచిన పెన్షన్లను బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కుటుంబం నుంచి మొదలుకొని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, శారీరకంగా, మానసికంగా వివక్షకు గురవుతున్న వికలాంగుల వర్గాన్ని సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో అవకాశాలు అందించాలనే సంకల్పంతో సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పడిన వికలాంగుల హక్కుల పోరాట సమితి చేసిన పోరాట ఫలితాలే నేడు పాలకులు చెప్పుకుంటున్న ప్రభుత్వ పథకాలని అన్నారు. అనంతరం వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కోల బాలరాజు గౌడ్, అధికార ప్రతినిధి సాయిలు, ఉపాధ్యక్షులుగా ఎస్.కె, హుస్సేన్, ప్రచార కార్యదర్శిగా నరేందర్, కామారెడ్డి పట్టణ అధ్యక్షులుగా ఎస్.కె నహీముద్దిన్, కార్యవర్గ సభ్యులుగా స్వామి, ఎస్.సుజాత, రాజయ్య, రాజునర్సు, షేక్ ఫయాజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సత్తిగరి లక్ష్మి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కంతి పద్మారావు, బట్ట వెంకట రాములు, యాదయ్య, రాజనర్సు, నర్సింహులు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై బాధ్యత అవసరం

- అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ




అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

**నవతెలంగాణ-కామారెడ్డి**

ఆరోగ్యంపై బాధ్యత అవసరమని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన, బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ బైక్ ర్యాలీని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో 40 మంది వరకు డాక్టర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని నా ఆరోగ్యం నా హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అరవింద్‌గౌడ్ మాట్లాడుతూ.. మన ఆరోగ్యంపై మనదే బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకొని దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డాక్టర్లు డాక్టర్ వెంకట్, డాక్టర్ రమణ, డాక్టర్ వెంకటేశ్వర గౌడ్, డాక్టర్ పుట్ట మల్లికార్జున్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, 40 మంది వరకు డాక్టర్ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల పథకంతో సాగునీరు



ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని కందకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీటిని అందించడానికి స్థానిక రైతుల సహాయ సహకారాలతో పేపర్‌మిల్లు వద్ద సాగునీటిని ప్రారంభించారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందించడానికి మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి చొరవతో రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా అలీసాగర్ టెక్నీషియన్లను పంపారని రైతులు పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభానికి కొన్ని పరికరాల అవసరం కాగా రైతులే స్వయంగా డబ్బులు వేసుకొని ఆ పరికరాలను అందించడంతో ఆదివారం పేపర్‌మిల్లు వద్ద గల మోటారును ప్రారంభించారు. చిన్న చిన్న సమస్యలు రావడంతో సోమవారం నాటికి నీలా గ్రామ రైతులకు సాగునీరు అందే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం వరి, పొగాకు, శనగ పంటలకు నీరు అవసరం కావడంతో రైతులందరూ ఐక్యమత్యంతో ఈ ఎత్తిపోతల పథకం ప్రారంభించడానికి కృషి చేశారు. ఎత్తిపోతల పథకం వద్ద గల మరో రెండు మోటార్లను మరమ్మతులు చేయిస్తే కందకుర్తి, పేపర్‌మిల్, నీలా గ్రామాల రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా రైతులకు నీరు అందించే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

## రైతులకు ఏం చేశారని రైతు పండుగ..?

- మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-రామారెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం గడుస్తున్నా రైతులకు ఏం చేశారని రైతు పండగ చేసుకుంటున్నారో చెప్పాలని మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆదివారం ప్రశ్నించారు. మండలంలోని పోసానిపేట వరి కల్లాల వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి మాట తప్పినందుకా, రెండు విడతల రైతుబంధు ఇవ్వనందుకా, కౌలు రైతులకు ప్రోత్సాహం ఇస్తామని ఇవ్వకపోయినందుకా, రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మాట తప్పినందుకా రైతు పండగలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతుబంధు మాజీ అధ్యక్షులు తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు తంకర్ రవి, బాలరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**నవతెలంగాణ-లింగంపేట్**

మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి షౌకత్ అలీ ఆధ్వర్యంలో శక్తి వనరులు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆసక్తితో పాల్గొన్నారు. విద్యార్థి రాము ప్రథమ బహుమతి, లక్ష్మణ్ ద్వితీయ బహుమతి, సాయి వర్ధన్ తృతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వహీదు సిద్ధికి, యూసుఫ్ విద్యార్థులు ఉన్నారు.

## ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డు అందుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు, సంగోజివాడి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జమీల్ అహ్మద్ ఆదివారం ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీనికి సహకరించిన మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆయనకు అవార్డును అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తనకు మరింత ప్రోత్సాహాన్ని కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ ఫరీదా, రక్తదాతల సమూహ సభ్యులు పాల్గొన్నారు.

## సాటాపూర్ మాజీ సర్పంచ్‌కు బహుజన్ సాహిత్య అకాడమీ అవార్డుకు ఆహ్వానం

**నవతెలంగాణ-రెంజల్**

సమాజంలో ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు అందించే బహుజన్ సాహిత్య అకాడమీ అవార్డుకు మండలంలోని సాటాపూర్ మాజీ సర్పంచ్ ఏకార్ పాషా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అవార్డు ఆహ్వాన పత్రికను హైదరాబాద్ జాతీయ కార్యాలయంలో ఆదివారం అందజేసినట్టు బహుజన్ సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ పేర్కొన్నారు. డిసెంబర్ 15న దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ ఐదవ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా 2018-2023 సంవత్సరానికి గానూ ఉత్తమ సర్పంచిగా ఎంపికైన, సమాజ సేవకుడిగా గుర్తింపు పొందిన ఆయనకు ఈ అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 27 రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్‌కు రానున్నారని ఆయన పేర్కొన్నారు. ఆహ్వానపత్రికను అందజేసిన వారిలో జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతమ్, రాష్ట్ర కోఆర్డినేటర్లు విష్ణు, హనుమన్లు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు గంధం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు

- విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడ పోటీలు



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**నవతెలంగాణ-ఎడపల్లి**

మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమం విజయోత్సవంలో భాగంగా పాఠశాల కళాశాలలో బాలికలు, ఉపాధ్యాయ బృందం బాలికల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన బాలికలకు బహుమతులను అందజేశారు. పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ గంగా శంకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం అందించే వివిధ పథకాలను ఏర్పాటు చేసిన సభలో ఆయన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించారు.

## మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న పలువురు

**నవతెలంగాణ-లింగంపేట్**

మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి ఆదివారం ఐలాపూర్ గ్రామానికి చెందిన కురుమ యువజన సంఘం సభ్యులు రూ.2 లక్షల 50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం 18 మంది కుల సంఘాల సభ్యులతో ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దురిశెట్టి అశోక్, ఆలయ కమిటీ సభ్యులు మారుతి, రవి, ప్రసాద్ గౌడ్, బాలయ్య, బైరయ్య, సంగమేశ్వర్, కుర్మ యువజన సంఘం సభ్యులు ఉన్నారు.